క్లుప్తంగా

నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 28న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.19 లక్షలతో సామాజిక భవన నిర్మాణం



వెంకటేశ్వర కాలనీలో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని సామాజిక భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏతు రవణమ్మ, స్థానిక నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్, నరసింగరావు, వెంకట్ భైరా, వల్లి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ 'మోర్చా'లో నియామకాలు




ఒమ్మి నారాయణరావు, కొండా ప్రసాద్

మురళీనగర్: బీజేపీ ఆంధ్రప్రదేశ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితుడిగా 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటకు చెందిన ఒమ్మి నారాయణరావు నియమితుడయ్యారు. ఈమేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి శ్రీనివాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఒమ్మి నారాయణరావు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు ఆయనను అభినందించారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర కార్య నిర్వాహకుడు పీవీఎన్ మాధవ్, రొంగలి గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రలకు నారాయణరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

తాటిచెట్లపాలెం: బీజేపీ యువ మోర్చా(యూత్ వింగ్) రాష్ట్ర అధికార ప్రతినిధిగా కైలాసపురానికి చెందిన కొండా ప్రసాద్ నియమితుడయ్యారు. బీజేపీ రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గంలో ఆయనకు స్థానం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, సాగి కాశీవిశ్వనాథరాజు, రవీంద్ర మేడపాటిలకు కొండా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల వివరాలు పరిశీలిస్తున్న కె.కె.రాజు



51వ వార్డులో కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



49వ వార్డులో మందులు అందిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

సీతమ్మధార: ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 25వ వార్డు 134 సచివాలయం పరిధిలోని ప్రజలకు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందిస్తోందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చినట్లు చెప్పారు. ముందుగా కె.కె.రాజు పేదలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు, ఏపీడీ దుర్గాప్రసాద్, సాడి కేశవరెడ్డి, కత్రి మురళీకృష్ణారెడ్డి, అమర్ రెడ్డి, బాబు, నర్సీ వైద్యులు మన్మోహన్, సచివాలయ అడ్మిన్, జీవీఎంసీ అధికారులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

విజయవంతంగా వైద్య శిబిరాలు

ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరించే దిశగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. 51వ వార్డు 290 సచివాలయం పరిధిలోని ప్రజలకు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలను ఆయన పరిశీలించి పేషెంట్లకు తగు సూచనలిచ్చారు. జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్, సచివాలయ అడ్మిన్ దేముడుబాబు, సిబ్బంది, వలంటీర్లు, శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలు పాటించాలి

మురళీనగర్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారందరూ వైద్యుల సలహాలు పాటించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు సూచించారు. 49వ వార్డు ఏఎస్సార్ నగర్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పరీక్షలు చేయించుకోవడానికి వచ్చినవారందరితో మాట్లాడారు. మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. పి.చైతన్య, ఎస్.శ్రీను, బి.శంకర్, బి.సరస్వతి, జి.ప్రశాంత్, ఎస్.సుబ్బులక్ష్మి పాల్గొన్నారు.

వామనుడిగా ప్రసన్న వేంకటేశ్వరుడు



వామన అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి



మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో దేవీ నవరాత్రులు, శ్రీవారి ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వామన అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వెంకన్నను ఊరేగించారు. ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో సీతంపేట రాధాకృష్ణ ఆలయం వద్ద దుర్గా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సాయంత్రం సరస్వతీ దేవికి స్థానిక విద్యార్థులు సామూహికంగా కుంకుమ పూజలు చేశారు. ముఖ్య అతిథి సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు దేవర రామకృష్ణ, బోర చిన్న, దుక్క అప్పన్న, తోనంగి లక్ష్మణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎస్‌ఎంఏ ట్రోఫీలో మెరిసిన మనీష్, శశికాంత్

ఎస్‌ఎంఏ టోర్నీలో ఆంధ్రా జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్‌ఎంఏ) ట్రోఫీలో విశాఖ కుర్రాళ్లు మెరిశారు. రాంచీ వేదికగా శుక్రవారం జరిగిన టీ-20 మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 145 పరుగుల తేడాతో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆంధ్రా తొలుత బ్యాటింగ్ చేసి నాలుగు వికెట్లకు 228 పరుగులు చేసింది. విశాఖ కుర్రాడు భరత్(కెప్టెన్) మూడు పరుగులకే బౌల్డ్ కాగా.. రషీద్ సెంచరీ నమోదు చేశాడు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ ఎనిమిది వికెట్లు కోల్పోయి 83 పరుగులే చేసింది.

విశాఖకు చెందిన శశికాంత్ రెండు వికెట్లు, జి.మనీష్ పొదుపుగా బౌలింగ్ చేసి ఓ వికెట్ సాధించాడు. సీ గ్రూప్‌లో ఆడుతున్న ఆంధ్రా జట్టు నాలుగు పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మనీష్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసి.. నాలుగు పరుగులిచ్చి ఓ వికెట్ తీయడంతో బెస్ట్ బౌలింగ్ రికార్డుగా నమోదైందన్నారు. ఎస్‌ఎంఏ ట్రోఫీలో ఇప్పటివరకు ఈ రికార్డు ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.

మానసిక ఆస్పత్రిలో ఉద్యోగాలకు 395 దరఖాస్తులు

ఏయూ క్యాంపస్: మానసిక ఆస్పత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే ఉద్యోగాలకు 395 దరఖాస్తులు వచ్చినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు అత్యధికంగా 342, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి 19, గ్రూప్ డీ అటెండర్ ఉద్యోగానికి 34 దరఖాస్తులు వచ్చాయన్నారు. చైర్‌పర్సన్ ఉద్యోగానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన పేర్కొన్నారు.

క్యాబ్ డ్రైవర్లకు దసరా కానుక



డ్రైవర్లకు గిఫ్ట్ బాక్స్‌లు అందజేస్తున్న కంపా హనోకు, రవిశంకర్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌లోని ఉదయ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాబ్ డ్రైవర్లకు దసరా కానుకగా గిఫ్ట్, స్వీట్స్ బాక్స్‌లు అందజేశారు. తాటిచెట్లపాలెంలోని వార్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా హనోకు మాట్లాడుతూ రోడ్ల మీద ప్రయాణించేటపుడు డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారిపై వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, వారి కోసం ఆలోచించి వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు కారుకోండ రాజు, హరి పట్నాయక్, నేపాల్ శ్రీను, బాబూరావు, ఈశ్వరరావు, దుర్గ, నాయుడు, గణపతి, శ్రీరామమూర్తి, కనకరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



లలితా పీఠంలో సరస్వతీదేవిగా లలితాదేవి



లలితా పీఠంలో సరస్వతి పూజ చేస్తున్న చిన్నారులు



సీతంపేటలో సరస్వతీ దేవిగా పార్వతీదేవి

అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆరో రోజు లలితానగర్ లలితా పీఠంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతీ పూజలు నిర్వహించారు. లలితా అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చన, గోపూజ, శతచండీ పారాయణ, మహాలింగార్చన, రుద్రాభిషేకం, గర్భాలయంలో శ్రీచక్రనవావరణ పూజలు చేశారు. సాయంత్రం సుబ్రహ్మణ్య, సరస్వతి, చండీ హోమాలు జరిగాయి. శనివారం దుర్గాదేవి అలంకరణలో లలితాదేవి దర్శనమిస్తారని, ఉదయం రాజశ్యామల, కాళీ హోమాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పార్వతీదేవికి విశేష పూజలు

సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శివాజీశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, గాయత్రి నామార్చన, చండీ హోమం, అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలితా పారాయణ పఠించారు. శనివారం రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

చదువులమ్మకు విద్యార్థుల పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర, పార్వతీ దేవాలయంలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులచే ప్రధాన అర్చకుడు గురునాథ్ శర్మ సరస్వతీ పూజలు చేయించారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాశరావు, మాదేటి సత్యనారాయణ, కత్రి సుధీర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చండికాదేవిగా లలితాదేవి

మురళీనగర్: మురళీనగర్ లలితాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని చండికాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి పెసర పునుకులు ప్రసాదంగా సమర్పించారు. ఆలయ కార్యదర్శి ననవల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మురళీనగర్‌లో చండికాదేవి అలంకరణలో లలితాంబిక



త్రిముఖ విఘ్నేశ్వర ఆలయంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు

ధ్యాన మందిర వైభవం

- ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో విరాజిల్లుతున్న షిర్డీసాయి మందిరం
- దసరా రోజున 29వ వార్షికోత్సవం
- రేపటి నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు



రైల్వే న్యూకాలనీలో వార్షికోత్సవానికి సిద్ధమైన షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం 29వ వార్షికోత్సవానికి సిద్ధమైంది. 1994లో దసరా రోజున మందిర నిర్మాణం, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగాయి. నాడు చిన్న మందిరంగా ఏర్పడి నేడు దినదినాభివృద్ధి చెందుతూ ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో ధ్యాన మందిరం విరాజిల్లుతోంది. నగరం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి బాబాను కనులారా దర్శించి.. చేతులారా పూజించి తరిస్తున్నారు. ఈ నెల 24న ధ్యాన మందిర వార్షికోత్సవం, దసరా పండగను పురస్కరించుకుని ఈ నెల 22 ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ధ్యాన మందిర విశేషాలు

ఈ మందిరంలోని ప్రతి విగ్రహానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ముఖ్యంగా సాయిబాబా వంట చేసి, వడ్డిస్తున్నట్లుండే విగ్రహం. ఇటువంటిది కేవలం షిర్డీలో మాత్రమే ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. దాని నమూనాతో ఇక్కడ దీనిని ప్రతిష్ఠించారు. మరో అరుదైనది బాబా నల్లరాతి విగ్రహం. జీవకళ ఉట్టిపడేలా ఉండే మైనపు విగ్రహం.

- మహిళా భక్తులు సాయి పల్లకీ మోసే అవకాశం కేవలం షిర్డీలోనే ఉంది. ఇప్పుడు దీనిని ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.

సేవా కార్యక్రమాలు



అరుదైన బాబా నల్లరాతి విగ్రహం

- 2009లో కేవలం 20 మందితో ఇక్కడ అన్నదానం ప్రారంభించారు. నేడు ప్రతి రోజు 100 నుంచి 200 మందికి, గురువారాల్లో మరింత ఎక్కువమందికి అన్నదానం నిర్వహిస్తున్నారు.
- దాతలు బహూకరించిన కమ్యూనిటీ ఫ్రిజ్‌ల ద్వారా 24 గంటలు ఆహారం అందుబాటులో ఉంచుతున్నారు.
- తరచుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు.
- సుశిక్షితులైన కళాకారిణులచే డ్యాన్స్, యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు.
- ధ్యాన మందిర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా షిర్డీ, పుణ్యక్షేత్రాల యాత్రలకు భక్తులను తీసుకెళ్తున్నారు.

వార్షికోత్సవ కార్యక్రమాలు

- ఈ నెల 22 నుంచి 24 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్రనామార్చన, భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, అనంతరం వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, బాబా వారి గీతాలాపన(భజన) పుణ్యావచనం, 108 బిందెలతో జలాభిషేకం, పంచగవ్యం, నవగ్రహారాధన, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.
- దసరా రోజున మధ్యాహ్నం మహా అన్నదానం ఉంటుంది.
- 24వ తేదీ బాబా వారి 105వ మహాసమాధి (పుణ్యతిథి) సందర్భంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతుంది.
- షిర్డీసాయిని అభిషేకించిన తరువాత కాశీ, హరిద్వార్‌ల నుంచి తెచ్చిన పంచముఖి రుద్రాక్షలు, కంకణాలు, బాబా ఫొటో, షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది భక్తులకు ఉచితంగా అందజేస్తారు.

దాతలు, భక్తుల సహకారంతో ముందుకు..



బాబా దయతో.. దాతలు, సాయి సేవకులు, భక్తుల సహాయ సహకారాలతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ 29 వసంతాలు పూర్తి చేసుకున్నాం. నిత్యం ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– నూతల శేషగిరిరావు, ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కంచరపాలెం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కంచరపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం, ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ ప్రాథమిక, ఆర్పీపేట హైస్కూళ్ల పరిధిలో శుక్రవారం ఆమె పర్యటించారు. పలు డ్రాప్ అవుట్ల ఇళ్లకు వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి మానేసిన విద్యార్థులను తప్పకుండా బడికి పంపాలని వారిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దసరా సెలవుల అనంతరం పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో ఫోన్‌లో మాట్లాడి డ్రాప్ అవుట్లు బడిలో చేరేలా బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్ఎస్ఏ సిబ్బంది గీత, సీఆర్పీలు లంక చైతన్య, రత్నం పాల్గొన్నారు.

దుర్గాదేవి పంచమరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు మార్గం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన వద్ద గల గాంధీనగర్‌లో కుమ్మరి-మేదర అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవి పంచమరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ సంఘం నాయకుడు దేవారపు రవి దంపతులు కలశ ప్రతిష్ఠ చేసి అమ్మవారికి తొలిపూజ జరిపారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు నిర్వాహకుడు రవి తెలిపారు.

జాబ్ మేళాలో 57 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. వెల్‌కేర్ ఫార్మా, సిద్ధి వినాయక ఇంజినీరింగ్ వర్క్స్, దసపల్లా హోటల్, టీసీఎస్ డిజిటల్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, పోలినేని అసోసియేట్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 411 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 122 మంది అభ్యర్థులు హాజరైతే 57 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.

పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ ఎం.అబ్రహాం సంపాదకత్వం వహించిన 'యూత్ పార్టిసిపేషన్ ఇన్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఎడాప్షన్' పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విపత్తు నిర్వహణపై విభిన్న నిపుణులు రచించిన 25 పరిశోధన పత్రాలను ఈ పుస్తకంలో ప్రచురించారు.